సాక్షి
బాపట్ల
మంగళవారం । 1 । ఆగస్టు । 2023




పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు సోమవారం సాయంత్రానికి 32.6455 టీఎంసీలకు చేరింది.



త్రికోటేశ్వరునికి వెండి బిందె

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ఎం.శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు కొడుకు వినీత్ పుట్టినరోజు సందర్భంగా 649 గ్రాముల వెండి బిందె బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ల నియామకం



ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



మర్రి రాజశేఖర్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం రీజినల్ కో–ఆర్డినేటర్లుగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఇకపై గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం పార్లమెంటరీ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లుగా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

నేటి ఉదయం నుంచే పింఛన్ కానుక పంపిణీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 2,67,487 మందికి మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బాలు నాయక్ సోమవారం వెల్లడించారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఒకటో తేదీన ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ప్రతి పెన్షన్‌దారుడి ఇంటి వద్దకు వెళ్ళి సక్రమంగా నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లకు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అదే రోజు స్థాయీ సంఘాల భేటీ


గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించేందుకు జెడ్పీ పాలకవర్గం నిర్ణయించింది. ఈమేరకు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. సర్వసభ్య సమావేశంతోపాటు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను అదే రోజున సమావేశపరిచేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నిర్ణయించారు. ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి ఆర్థిక–ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, మహిళా సంక్షేమం, అభివృద్ధి పనులకు సంబంధించిన ఏడుస్థాయీ సంఘాలు భేటీ కానున్నాయి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులకు సమావేశాల షెడ్యూల్ పంపించారు.

ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీగా పనిచేస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ పదవీ విరమణ చేయడంతో నరసరావుపేట డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న డాక్టర్ శోభారాణిని ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

31,875 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,875 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,259 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,908 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చదువులపై మదింపు

- నేటి నుంచి ఎఫ్ఏ, సీబీఏ–1 పద్ధతిలో పరీక్షలు
- ఒకటి నుంచి 8 తరగతులకు ఓఎంఆర్ బేస్డ్ విధానం
- 9, 10 తరగతుల విద్యార్థులకు ఫార్మేటివ్
- ఈసారి కొత్తగా టోఫెల్ పరిచయం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 85,278 విద్యార్థులు



పాఠశాలలో విద్యార్థులు

బాపట్ల అర్బన్ : విద్యార్థుల అభ్యసన మదింపు, సమస్యలను అంచనా వేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహించడం పరిపాటి. గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) పేరుతో నిర్వహిస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్ రెండు సమితి పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) ఏర్పాట్లు చేస్తుంది. గత ఏడాది మాదిరిగానే ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ, 9, 10 తరగతుల వారికి ఫార్మేటివ్ విధానాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

సామర్థ్యం వెలికితీతే ఉద్దేశం

ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభమైంది. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు జరుపుతున్నారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా అభ్యసన లోపాలను గుర్తిస్తారు. విద్యార్థులు వెనకబడిన అంశాలను గుర్తించి ప్రత్యేక బోధన ద్వారా వారి సాధన స్థాయికి చేరేలా చూస్తారు.

సీబీఏ విధానం ఎందుకంటే

విద్యార్థుల్లో ఉత్తమ విద్య ప్రమాణం పెంచే క్రమంలో సీబీఏ విధానాన్ని అమలు చేస్తున్నారు. పక్క బోధనతో విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయడమే ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ–1,3 ఎస్ఏ–2కు బదులు సీబీఏ విధానంలో ఎఫ్ఏ–2,4 ఎస్ఏ–1 పరీక్షలు పాత విధానంలో నిర్వహించనున్నారు. 9,10 తరగతులకు నాలుగు ఎఫ్ఏలు రెండు సెమిటివ్ పరీక్షల ఫార్మేటివ్ విధానంలో అమలు చేస్తారు.

ద్విభాష ప్రశ్నపత్రాలు

విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా ప్రశ్నపత్రాలు రూపొందించారు. ప్రశ్నపత్రం బై లింగ్వల్(తెలుగు, ఆంగ్లం) విధానంలో ఉంటుంది. విద్యార్థికి ఇంగ్లిష్‌లో ప్రశ్న అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకునే వెసులుబాటు కలిగించారు. ఈ విధానం గత ఏడాది ప్రవేశపెట్టారు.

ఆబ్జెక్టివ్ విధానం ప్రశ్నలు

పది మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, ఐదు మార్కులకు రాతపూర్వకంగా జవాబులు రాయాలి.

- విద్యార్థిని సమగ్రంగా అంచనా వేశాలా ప్రశ్నలుంటాయి.
- మెకానికల్ అండర్ స్టాండింగ్ అప్లికేషన్(ఎంయూఏ) ప్రశ్నపత్రం ఉంటుంది.
- ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాలి.

ఐదు వరకు నిర్వహణ

సీబీఏ విధానంలో పరీక్షలు ఆగస్టు ఒకటి నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 49,904, ప్రైవేట్ యాజమాన్యాల్లో 31,957 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. 1–8 తరగతులు వరకు 85,278 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. పాత విధానంలో 9 ,10 తరగతులకు చెందిన 40,247 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



పరీక్ష పత్రాలు ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రానికి చేరాయి. వీటిని కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య మండల కేంద్రాలకు చేర్చాం. పరీక్ష పేపర్లకు ఎంఈఓలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని మార్గదర్శకాలు ఎంఈఓలు హెచ్ఎంలకు వివరించారు.

– డి.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ బాపట్ల

నూతన విధానంపై అవగాహన



గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్న సీబీఏ విధానంపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉంది. టోఫెల్ పరీక్షను కొత్తగా అమలు చేస్తున్నాం. దీనిపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాటు చేశాం.

– పి.వి.జె.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల



మాట్లాడుతున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య

మైనింగ్ డాన్ గొట్టిపాటి

- నువ్వు పులి కాదు.. పిల్లివే
- రెండు సింహాలు కొట్టుకుంటుంటే మధ్యలో గెలిచావ్
- తెలుగు మాట్లాడటం రాని లోకేష్‌కు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హతే లేదు
- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య

అద్దంకి: డొక్కు అంబాసిడర్ వేసుకుని తిరిగే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మైనింగ్ డాన్‌గా మారి కోట్లకు పడగలెత్తాడని శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఒంగోలులోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ అద్దంకి సభలో మాట్లాడిన మాటలను తప్పుబట్టారు. తెలుగు భాష సరిగా మాట్లాడటం రాని లోకేష్‌కు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని చెప్పారు. కనీసం ఒకసారైనా గెలిచి మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. ‘మీకేదో అప్పుడే అధికారం వచ్చినట్లుగా రెడ్ బుక్‌లో పేర్లు రాసుకుంటున్నా.. మీ సంగతి చూస్తానని, పోలీసులను అధికారులను బెదిరిస్తున్నావు.. నేను మూర్ఖుడనని నీవే చెప్పుకుంటున్నావు. ఎవరైనా మూర్ఖుడిని నాయకుడిగా పెట్టుకుంటారా’ అని ప్రశ్నించారు. సైకిల్‌ను ఢీకొట్టగలిగే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు.

ద్వారాలు తెరవకనే..

‘నేను ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ మారలేదంటున్నావు.. కాంగ్రెస్ నుంచి కేసులు మాఫీ చేసుకోవడానికి కాదా పార్టీ మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన మొదట్లోనే నీవు పార్టీలో చేరాలని ప్రయత్నించలేదా? ద్వారాలు తెరవకనే ఊరుకున్నావు.. మాయమాటల సంగతి ప్రజలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మంచి నీటి పథకంలో భాగంగా మల్లవరం నుంచి నీరు అద్దంకి తేవడానికి ప్లాంటు శింగరకొండ దగ్గర పెట్టడం రూ.5 కోట్ల కమీషన్ కోసం కాదా? మేము వచ్చిన తరువాత రీ ఎస్టిమేషన్ వేయించి రూ.12 కోట్లు మిగిల్చాం. అద్దంకిని అభివృద్ధిని చేసింది మేము. నాలుగేళ్ల క్రితం పట్టణం ఎలా ఉంది. నేడు ఎలా ఉందో జనం అందరికీ తెలుసు. అబద్ధాలు చెబితే ఎవరూ నమ్మరు. నీవు ఇప్పించలేని ఈనాం భూములకు పాస్‌పుస్తకాలు ఇప్పించాం. నీ వల్ల కాని వేలమూరిపాడు రోడ్డు మేము వేయించాం. మల్లాయపాలెం వాసులను అధికారంలో ఉన్న సమయంలో ఖాళీ చేయించాలని బెదిరించింది నీవు కాదా? ఇంత చేసి మేము చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉంది. రాబోయే ఎన్నికల్లో నీవు పులివా..పిల్లివా తెలిసిపోతుంది. నిన్ను గతంలో కాపాడిన సింహాలే నిన్ను కొట్టబోతున్నాయి. ఈ సారి నీవు ఓడిపోవడం ఖాయం’’ అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఉద్దేశించి అన్నారు. సమావేశంలో సంతమాగులూరు జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, పీడీసీసీబీ డైరెక్టర్ సోనీ, బల్లికురవ మండల కన్వీనర్ చింతల పేరయ్య, నాయకులు మస్తాన్‌రావు, శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, కె. రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల్లో ఎక్కువగా స్పందన అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. జగనన్న సురక్ష, గ్రీన్ బాపట్ల, గృహ నిర్మాణాలు జిల్లాలో చక్కగా అమలు చేశారని అధికారులను అభినందించారు. రాబోయే రోజుల్లో ఇదే విధంగా కష్టపడి పనిచేయాలని కోరారు. జిల్లాలో త్వరలో గ్రామ దర్శిని కార్యక్రమాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామ దర్శిని కార్యక్రమంలో ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు సమస్యలు గుర్తించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో నా మట్టి– నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఒకే రోజు రెండులక్షల మొక్కలు నాటిన కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా చేశారని ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ అభినందించారు. మొత్తం 80 అర్జీలు స్పందనలో నమోదయ్యాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, సీపీఓ భరత్ కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, డీపీఓ రాంబాబు, డీఎంహెచ్ఓ విజయమ్మ, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ జేడీలు అబ్దుల్ సత్తార్, హనుమంతరావు, సురేష్, పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ విల్లేమ్స్, డీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పక్కన జేసీ శ్రీధర్

పంద్రాగస్టుకు ఘనంగా ఏర్పాట్లు

బాపట్ల: జిల్లాలో స్వాతంత్ర్య వేడుకలు పకడ్బందీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఉత్సవాలపై అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాలను తయారుతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చే విధంగా చిన్నారులను తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, సీపీఓ భరత్ కుమార్, డీఆర్డీఏ పీడీ అర్జున్, డ్వామా పీడీ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ జేడీలు అబ్దుల్ సత్తార్, హనుమంతరావు, సురేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, డీఎంహెచ్ఓ విజయమ్మ, డీఎస్ఓ విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చుకుని వ్యక్తి బలవన్మరణం



మృతి చెందిన పాండ్యన్

చినగంజాం: భార్యాభర్తల మధ్య వివాదంతో ఒక వ్యక్తి నాటు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. మండలంలోని మోటుపల్లి పంచాయతీ పరిధిలో జరుబుల రమేష్ రొయ్యల చెరువుల వద్ద తమిళనాడుకు చెందిన పాండ్యన్(27) కొంతకాలంగా కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. స్థానికంగా నక్కలోళ్లుగా చెప్పుకొనే సామాజిక వర్గానికి చెందిన పాండ్యన్‌కు ఇద్దరు భార్యలు కాగా రొయ్యల చెరువుల వద్దే కాపురముంటున్నాడు. వారిలో మొదటి భార్య రమ్య కాగా ఆమెది కూడా అతడికి చెందిన ప్రాంతమే. రెండో భార్య తులసిది కుప్పం. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం తులసికి పాండ్యన్‌తో ఏర్పడిన వివాదం కారణంగా అలిగి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో పాండ్యన్ నాటు తుపాకీతో కణతకు గురిపెట్టి కాల్చుకొని బలవన్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనా స్థలంలో వారికి ఎటువంటి ఆధారాలు లభించలేదు. వారి వద్ద కనీసం సెల్‌ఫోన్ కూడా లేకపోవడంతో అక్కడ ఉన్న భార్య రమ్యను విచారించి కొంత సమాచారం రాబట్టారు. ఆమె అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు పంపనున్నట్లు ఎస్ఐ కే సురేష్ తెలిపారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తోంది. మృతుడికి ఐదేళ్ల కుమార్తె ఉంది.

అధ్యాపకుల వయోపరిమితి పెంపు హర్షణీయం

- మెరుగైన సేవలకు దోహదం
- ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏఎన్‌యూ: యూజీసీ పే స్కేల్ పొందుతున్న రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడం హర్షణీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ యూనివర్సిటీ అధ్యాపక సంఘం నూటా ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీలో కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల వయోపరిమితి పెంపు వలన విద్యార్థులకు మరిన్ని సేవలు అందించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఉన్నత విద్యలో రాష్ట్ర వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు జరిగాయని, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు జరిగిందన్నారు. రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ మాట్లాడారు. నూటా అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య పాల్గొన్నారు.



వర్సిటీ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

సభకు ముందు నూటా ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నూటా పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కల్తీ పాపాలు!

‘పాలు.. చంటి పిల్లడి నుంచి వృద్ధుల వరకు ఇష్టమైన ఆహారం.. పౌష్టికాహారంలో అగ్రస్థానం.. అందరికీ అందుబాటులో ఉండి అందరికీ ఆమోదయోగ్యమైనదిగా మారింది.. కొందరు స్వార్థంతో పా‘పాలు’కు పాల్పడుతున్నారు. కృతిమ దిగుబడి కోసం బరితెగిస్తున్నారు.. అధికారులకు కళ్లుగప్పి యథేచ్ఛగా ప్రజల రోగాలకు ఎసరు పెడుతున్నారు...

- దగ్గరవుతున్న రోగాలు
- పశువులపై నిషేధిత ఆక్సిటోసిన్ డ్రగ్ వాడకం
- పాల ఉత్పత్తి పెంపు కోసం హార్మోన్ల ప్రయోగం
- తాగితే అనేక అనర్థాలు



గేదెకు పాలచేపు కోసం ఇంజక్షన్ వేస్తున్న దృశ్యం

చీరాల: సాధారణంగా ప్రజలు పాలంత స్వచ్ఛంగా ఉండాలని చెబుతుంటారు. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం పాలు వెనుక కూడా ‘విషం గాథ’ నడుస్తోంది. తెల్లటి పాల నురగల వెనుక విషం కూడా దాగి ఉంది. కొందరి అవసరాలు, స్వార్థం కోసం పాలను విషతుల్యం చేస్తున్నారు. ప్రజలు అమాయకంగా తాగేస్తున్నారు.

ఎలా కల్తీ చేస్తున్నారంటే..

దిగుబడి ఆశతో పాడి గేదెలకు దూడలను దూరం చేస్తారు. గేదెకు పొదుగు నుంచి రొమ్ముల వరకు పాలు రావాలంటే దూడ కొద్దిసేపు పొదుగు వద్ద చేపేందుకు ప్రయత్నం చేయాల్సి ఉంది. దూడ లేకుంటే మిగులు పాలన్నీ అమ్ముకోవచ్చనే దురాలోచనతో దూడ బదులు నిషేధిత డ్రగ్ ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను రోజుకు రెండు సార్లు గేదెలకు వేసి మొత్తం పాలు పిండుతున్నారు. దూడలు పాలు సరిపోక అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి. వీటిని కబేళాలకు తరలిస్తున్నారు.

ఆక్సిటోసిన్ దొరుకుతోంది ఇలా...

ఆక్సిటోసిన్ ఒక్క ఇంజక్షన్లు రహస్యంగా అమ్ముతున్నారు. ఒక ఇంజక్షన్ రూ.25 లభ్యమవుతోంది. వేస్తే చాలు క్షణాల్లో పొదుగు నుంచి పాలు కారిపోతాయి. అంత ప్రమాదకర హార్మోన్లు ఉండే ఈ ఇంజక్షన్లను నోరులేని జీవాలు తట్టుకోవడం చాలా కష్టంగా ఉన్నా తప్పని పరిస్థితి. బాపట్ల జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల్లో కూడా వీటి అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి.

ప్రభుత్వం నిషేధించినా..

ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు వాడకం వలన ఆ పాలు తాగిన వారికి అనారోగ్యంతో పాటు పశువులు మృత్యువాత పడుతున్నాయనే ఉద్దేశంతో చాలా కాలంగా ఈ ఇంజక్షన్లను ప్రభుత్వం నిషేధించింది. కానీ చాటుమాటున ఆ ఇంజక్షన్లు చెన్నై నుంచి మన రాష్ట్రానికి తరలించి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. పశువుల మందులు అమ్మే దుకాణాలతో పాటుగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలతో పాటుగా కొందరు వీటిని ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఈ నిషేధిత డ్రగ్‌ను విక్రయిస్తున్నారు.

తాగితే అనర్థాలు..

పాలు తాగితే ఆరోగ్యమంటారు. కానీ ఆక్సిటోసిన్ ఇంజక్షన్ వాడిన గేదెల పాలు తాగితే అనేక అనర్థాలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర హార్మోన్లు కలిసిన ఈ పాలు తాగితే క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయి. కళ్ల జబ్బులతో పాటు ఆడ పిల్లలు చిన్న వయసులోనే మెచ్యూర్ కావడం, వక్షోజాలు పెరగడంతో పాటు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదముంది. అయినా పశువులకు వాడే మందుల షాపుల నిర్వాహకులు మాత్రం యథేచ్ఛగా అమ్మకాలు చేస్తు రూ.లక్షలు గడిస్తున్నారు. ఇంజక్షన్లను పాడి గేదెలకు వేయడం వలన గేదెలు ఎదకు రాకపోవడం, గర్భసంచి వంటి జబ్బులతో పాటు తక్కువ కాలానికే ఆ గేదెలు చనిపోతున్నాయి.

పశువులకు ప్రమాదకరం..

పిట్యూటరీ గ్రంథి ద్వారా ఆక్సోటోసిన్ హార్మోన్ ఇంజక్షన్లు తయారవుతాయి. ఆక్సిటోసిన్ హార్మోన్ ఇంజక్షన్ వాడకం అనైతికం. ప్రమాదకరమైన హార్మోన్లు ఉండటం వలన గేదెలు తట్టుకోలేక ఎదకు రాకపోవడం, గర్భం దాల్చినా మధ్యలోనే చనిపోయిన దూడలను వదలడంతో పాటు గర్భాశయం చుట్టూ ఉన్న కండరాలు వదులై గర్భాశయ సమస్యలు ఏర్పడతాయి. ఎదకు రాకపోవడంతో వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి పశుసంవర్ధక అధికారులు, సిబ్బంది తనిఖీలు చేసి అమ్మకందారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎం.హనుమంతరావు, జిల్లా పశువైద్యాధికారి

జిల్లాలో గేదెల సంఖ్య	3,80,000
తెల్ల జాతి పశువులు	21000
రోజుకు పాల ఉత్పత్తి	7.5 లక్షల లీటర్లు
గృహ అవసరాలకు	5.29 లక్షలు
పాల ఉత్పత్తులకు	2.21 లక్షలు

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం

–ఎంపీ మోపిదేవి



విద్యుత్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని చినమట్లపూడిలో కోటి రూపాయలతో చేపట్టనున్న విద్యుత్ ఆధునికీకరణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి కోటి రూపయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులతో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పంట కాలువలకు సక్రమంగా సాగునీరు రావడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందిన ఆయన ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీకృష్ణయ్య, బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లలో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం: గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పెట్రోల్ బంక్‌లలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో గుంటూరు జిల్లా ఆటోనగర్ శ్రీ పీఏస్‌రావు ఫ్యూయల్ ప్రొడక్ట్స్ (బీపీసీఎల్), బాపట్ల జిల్లా బర్తిపూడి గ్రామంలోని గృహలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు కొనసాగాయి. తనిఖీల్లో సీఐ ఎ.శ్రీహరిరావు, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, గుంటూరు లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలర్ కొండారెడ్డి, ఏఎస్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి, బాపట్ల సహాయ కంట్రోలర్ లిల్లీ, సీఎస్ డీటీ ఓంకార్, సిబ్బంది పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్

గుంటూరు: ఈనెల 5, 6 తేదీల్లో గుంటూరులో లీలావతి మెమోరియల్ ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని పోటీల నిర్వాహకుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో దీనికి సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు రూ.75వేలు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9063142105కు సంప్రదించాలని తెలిపారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు, వై.వి.కె.చక్రవర్తి పాల్గొన్నారు.

నకిలీ బయో ఉత్పత్తులు స్వాధీనం

నిర్వాహకుడిపై కేసు నమోదు



నకిలీ బయో ఉత్పత్తులు, లేబుల్స్‌తో ఏడీఏ శ్రీనివాసరావు, సీఐ రామనాయక్

కొరిటిపాడు(గుంటూరు): అనుమతులు లేకుండా నకిలీ బయో ఉత్పత్తులు తయారు చేస్తున్న వ్యక్తిని వ్యవసాయశాఖ అధికారులు తయారీకి వినియోగించే ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. కొటాల మురళీకృష్ణ అనే వ్యాపారి స్థానిక సంజీవయ్యనగర్, 6వ లైనులోని తన సొంత ఇంట్లో గత కొంతకాలంగా ఎస్‌కేఎం నేచురల్ ప్రొడక్ట్స్‌ను అనుమతి లేకుండా తయారు చేస్తూ రైతులకు అనధికారికంగా విక్రయాలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లుకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం మురళీకృష్ణ ఇంటిలో గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, అర్బన్ ఏఓలు అంజిరెడ్డి, కిషోర్‌లు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 100 లీటర్ల నకిలీ బయో లిక్విడ్, 20 లీటర్ల ఖాళీ డబ్బాలు 5, మిక్సీ, జార్, 329 నకిలీ లేబుల్స్(సంజీత్, శ్రీధర్, స్టార్‌వన్ పేర్లతో ఉన్నవి), 250 మిల్లీ లీటర్ల ఖాళీ డబ్బాలు 28 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌కేఎం నాచురల్ ప్రొడక్ట్స్, మదనపల్లి పేరుతో తయారవుతున్న లేబుల్స్, వాటిపై ఉన్న చిరునామా తప్పుగా ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఏ విధమైన లైసెన్స్, అనుమతి పత్రాలు లేకుండా, నకిలీ లేబుల్స్ ముద్రించి రైతులకు సరఫరా చేసి చేస్తున్నారని, దీంతో వీటిని స్వాధీనం చేసుకుని ఐపీసీ–420 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని అరండల్‌పేట పోలీసులను కోరడం జరిగిందని వెల్లడించారు. అరండల్‌పేట సీఐ రామనాయక్, ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని నకిలీ బయోఉత్పత్తులు, ఖాళీ డబ్బాలు, లిక్విడ్, లేబుల్స్, మిక్సీ, జార్‌లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో స్థానిక వీఆర్‌ఓ బి.రాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆర్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా వ్యాధులకు తగినన్ని మందులు

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ వెల్లడి

నరసరావుపేట: జిల్లాలో 1.14లక్షల మలేరియా పరీక్ష కిట్లు, 2099 డెంగీ పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ వెల్లడించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీలకు మందులు లేవంటూ ఓ పత్రికలో శనివారం వచ్చిన కథనాన్ని సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 22,200 క్లోరోక్విన్ మాత్రలు, దాదాపు 15 వేల ప్రిమాక్విన్ మాత్రలు, 1500 ఏసీటీ మాత్రలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా మందులు, కిట్లకు కొరతలేదని స్పష్టం చేశారు. జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో దోమల నియంత్రణ, సంబంధిత వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటిస్తూ ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త, ఆరోగ్య పర్యవేక్షకుడు కలసి తనకు కేటాయించిన గృహాలను సందర్శించి వారి ఇంటి లోపల, పరిసరాలను గమనించి దోమలు వృద్ధి చెందే ప్రాంతాలు ఉంటే వాటిని గుర్తిస్తున్నారన్నారు. గృహ యజమానుల సహకారంతో వాటిని తొలగించడమే కాకుండా ఇంటిలోని వారికి వ్యాధులు, దోమల వ్యాప్తిని నివారించే పద్ధతులను వివరిస్తున్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

గురజాల : పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురజాలలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....గురజాలకు చెందిన నెల్లూరి ఈశ్వరరావు (43) పురుగుమందు దుకాణంలో రిప్రజెంటేడ్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. అతని స్నేహితుడు పిడుగురాళ్లకు చెందిన చల్లగుండ్ల రమేష్‌బాబుకు రూ.9లక్షలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు ఇవ్వాలని ఎన్నిమార్లు అడిగినా అతని నుంచి సమాధానం రాకపోవడంతో 30వ తేదీన పిడుగురాళ్ల వెళ్లి రమేష్‌బాబును గట్టిగా అడగ్గా నా వద్ద డబ్బులు లేవు నేను ఇవ్వను నీ ఇష్టం వచ్చింది చేసుకో అని అన్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఈశ్వరరావు గురజాల వచ్చి రామాలయం వద్ద పురుగుమందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో భార్య నెల్లూరి పద్మావతి బంధువులతో కలసి ఈశ్వరరావును వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు కలరు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లోకేష్ పాదయాత్రలో వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన కిట్టయ్య

అద్దంకి రూరల్: నారా లోకేష్ పాదయాత్రలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పాదయాత్రలో మద్యం ఏరులై పారింది. దీనికి తోడు పక్క మండలాలు, పక్క నియోజకర్గాల నుంచి జనాన్ని తరలించారు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన గుంజి కిట్టయ్య అద్దంకిలో నిర్వహించిన యువగళం పాదయాత్రకు స్నేహితులతో కలసి వచ్చాడు. ఈక్రమంలో ఊరు వెళ్లకుండా అద్దంకిలోనే తిరుగుతూ గాయాలపాలయ్యాడు. సోమవారం పట్టణంలోని దర్శి రోడ్డు పడి ఉండటంతో స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్ తరలించారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 80 మంది బాధితులు స్పందన కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను నేరుగా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న వెంటనే ఆయా పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ స్పందనకు వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన విచారించి పరిష్కరించాలని కోరారు. స్పందన ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా పరిష్కరించాలని చెప్పారు. స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందన కార్యక్రమానికి అధికంగా కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షునిగా ఆర్.శ్రీనివాసరెడ్డి (వెన్నాదేవి), ప్రధాన కార్యదర్శిగా ఆర్.గోవిందరాజులు (కాకాని), కోశాధికారిగా బి.వెంకటేశ్వర్లు (బొప్పూడి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గం, డివిజన్, మండలాలకు ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులను సోమవారం గౌరవాధ్యక్షుడు ఎస్.ఎం.సుభాని ప్రకటించారు. జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎం.డానియేల్ (నాగవరం), ఏ శ్రీనివాసరెడ్డి (తాళ్లూరు), ఎస్.అన్నపూర్ణ (పొట్లూరు), మహిళా ప్రతినిధిగా కె.పద్మజ (అమీన్‌సాహెబ్‌పాలెం), మున్సిపల్ స్కూల్ ప్రతినిధిగా టి.రవికాంత్ (నరసరావుపేట) ఎన్నికయ్యారు. నరసరావుపేట డివిజన్ అధ్యక్షునిగా కె.వి.రామిరెడ్డి (లింగారావుపాలెం), ప్రధాన కార్యదర్శిగా వి.సాంబానాయక్ (ఏ.ముప్పాళ్ల), సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షునిగా పి.రమేష్ (మాదల), ప్రధానకార్యదర్శిగా ఎన్.నాగేశ్వరరావు (లెనిన్‌నగర్) ఎన్నికయ్యారు. మండలాల కౌన్సిల్ సభ్యులుగా షేక్ రసూల్, ఆర్.గోవిందరాజులు (నరసరావుపేట), టి.నగేష్, బి.వి.ఎల్.ప్రసాద్ (నకరికల్లు), ఐ.వి.మోహన్‌రెడ్డి, వి.వెంకట్రావు (నాదెండ్ల), నరసింహారావు, వి.సాంబానాయక్ (ఈపూరు), ఎస్.అన్నపూర్ణ (శావల్యాపురం), ఎం.సాంబశివరావు, జె.శ్రీనివాసరావు (వినుకొండ), బి.వెంకటేశ్వర్లు, ఎం.కిషోర్ (చిలకలూరిపేట), ఎం.రామారావు, ఐ.వి.నాగమణి (మాచర్ల), జి.రంగరాజు (వెల్దుర్తి), ఆర్.చంద్రశేఖర్ (దుర్గి) ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.తిరుమలేష్, జి.శ్రీనివాస్, పి.జాకబ్ వ్యవహరించారు.

సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం పోలీస్ అధికారులు, పబ్లిక్ సర్వీస్ ప్రాసిక్యూటర్లు (పీపీ), సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిలాల్లో అన్ని రకాల కేసుల్లో దర్యాప్తు మొదలు నుంచి ఆ కేసులు పూర్తయ్యేవరకు కోర్టులలో వచ్చే పలు సమస్యలపై చర్చించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్, పీపీ ప్రాసిక్యూషన్ ఇరువురు సమన్వయం పాటిస్తూ, తద్వారా సహాయ సహకారాలు అందించుకుని నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేలా పనిచేయాలని అన్నారు. పోలీస్ అధికారులు నిరంతరం పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలించాలని అన్నారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ కేసులు పరిష్కరించాలన్నారు. చట్టంలోని ప్రతి ఒక్క సెక్షన్‌పై న్యాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉంటుందని, ఇరువురు సమన్వయంతో పని చేస్తూ, సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్తే బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసుశాఖ అన్నివేళల్లో సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు. గుంటూరు జిల్లా పి.పి.సిరాజుద్దీన్, గుంటూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక కోర్టు పీపీ, పలువురు పీపీలు, ఏపీపీలు, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు

పాత గుంటూరు: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిలిపి, శాంతి నెలకొల్పాలని రెవరెండ్ డాక్టర్ రెబ్బా ఇమ్మానియేల్ కోరారు. సోమవారం లక్ష్మీపురం సర్కిల్‌లో ఎమినెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక దాడులకు నిరసన తెలుపుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ శామ్యూల్ జోనాథన్, క్రైస్తవ వ్యవహారాల సలహాదారు ఫాదర్ మద్దు బాలస్వామి, ఫెలోషిప్ ప్రెసిడెంట్ మోహన్, విజయ్‌కుమార్, బిషప్ బి.జాకబ్, ప్రేమ్‌కుమార్, బి.జోసఫ్, బి.యం.రాజు, వి.బాపూజీ, క్రైస్తవులు పాల్గొన్నారు.

దూర విద్య టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఏడాది ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు టెన్త్‌లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. అదేవిధంగా 15 ఏళ్లు నిండి, టెన్త్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్లో ప్రవేశానికి అర్హులని వివరించారు. పూర్తి వివరాలకు www. apopenschool. ap. gov. in వైబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

క్రికెటర్ అంబటి రాయుడు విస్తృత పర్యటన



తాడికొండ: తుళ్లూరు మండలంలో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సోమవారం పర్యటించారు. వెలగపూడిలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమరావతి రైతులు రోడ్డుపైకి రాగా వారితో మాట్లాడి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడం జెడ్పీ హైస్కూల్‌కు చేరుకున్న ఆయన చిన్నారులతో కలసి కొద్ది సేపు సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం ఐనవోలు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెలగపూడిలో డ్వాక్రా మహిళలతో ముచ్చటించి, వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, రుణమాఫీ, పావలా వడ్డీ అందుతున్న తీరుపై ఆరా తీశారు.

డాక్టర్ యాస్మిన్ దంపతులకు ఘన సన్మానం



డాక్టర్ యాస్మిన్ దంపతులను సన్మానిస్తున్న పలువురు అధికారులు

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓగా, గుంటూరు ఆర్డీగా సుమారు వైద్య రంగంలో 36 సంవత్సరాల సుదీర్ఘ సేవలు అందించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. గుంటూరులోని ఏపీ ఎన్జీఓ కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి పలు జిల్లాలకు చెందిన డీఎంహెచ్‌ఓలు, వైద్యులు, వైద్య సిబ్బంది హాజరయ్యారు. పలువురు డీఎంహెచ్‌ఓలు, వైద్యులు డాక్టర్ యాస్మిన్‌తో తమకున్న అనుబంధాలను నెమరు వేసుకున్నారు. వైద్యురాలిగా, వైద్య అధికారిగా ఆమె సేవలను కొనియాడారు. అందరి సహకారంతో, భర్త ప్రోత్సాహంతో విజయవంతంగా వైద్యరంగంలో సుదీర్ఘకాలం పనిచేశానని డాక్టర్ యాస్మిన్ తెలిపారు. ఏపీ ఎన్జీఓ నేతలు, గుంటూరు ఆర్డీ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు డాక్టర్ యాస్మిన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కూరాకుల శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్‌పిఎస్ సూరి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.వి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.సునీల్ కుమార్, ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్‌లు రాజ్‌కుమార్, సుధీర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు సుబ్బారావు, శ్యామ్ అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య రామ్మోహనరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ నూతన విద్యా విధానం–2020పై వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ మనం ప్రస్తుతం నాలుగో పారిశ్రామిక యుగంలో ఉన్నామని, డిజిటలైజేషన్‌కు సంబంధించిన ఉద్యోగాల కల్పనే ఎక్కువగా ఉందని వివరించారు. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూపొందించబడినదే నూతన విద్యా విధానమని అన్నారు. చాట్ జీపీటీ వంటి మేధోపరమైన విజ్ఞానశాస్త్ర అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు కళాశాలలో కేవలం విజ్ఞానాన్నే సమకూర్చుకుంటే సరిపోదని, నైపుణ్యాలతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకునే విధంగా సీఎస్‌పీ, ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్స్ ఉన్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ నూతన విద్యా విధానం విద్యార్థి కేంద్రంగా రూపొందించబడిందని తెలిపారు. కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి మూడేళ్లు గడిచాయని తెలిపారు.

సీజీజీబీ ఆర్థిక సంవత్సర నివేదిక ఆవిష్కరణ



వార్షిక నివేదిక ఆవిష్కరిస్తున్న సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి

నగరంపాలెం: ఏపీ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు, బ్యాంక్ ఉన్నతాధికారుల సమక్షంలో తన చాంబర్‌లో ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఎనిమిది జిల్లాలో 249 శాఖలతో 27 లక్షల మంది ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. గత ఆర్థిక ఏడాదికి రూ.17,582 కోట్ల వ్యాపారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నిర్వాహణాధికారులు, సిబ్బంది, ఖాతాదారులను అభినందించారు. అంతేగాక ఖాతాదారుల సౌకార్యార్థం మొబైల్ బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా అందించేందుకు సి.జి.జి.బి. మనీ 2.0 యాప్‌ని ఆవిష్కరించడం మంచి శుభపరిణామమన్నారు. బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కనబరిచిన ఈ ఫలితాలు ఖాతాదారులకు తమ పనితీరుపై ఉన్న నమ్మకానికి నిదర్శనం అన్నారు. జనరల్ మేనేజర్లు డాక్టర్ బీవీ రమణరావు, పి.మారుతీరామ్, గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి పాల్గొన్నారు.